క్లుప్తంగా

పక్కాగా ఈ-క్రాప్ నమోదు చేయండి

వేముల : రబీలో సాగు చేసిన పంటలకు పక్కాగా ఈ-క్రాప్ నమోదు చేయాలని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సిబ్బందికి సూచించారు. సోమవారం వేములలో వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బంది చేపట్టిన ఈ-క్రాప్ నమోదుపై క్షేత్రస్థాయిలో ఏఓ చెన్నారెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి పంటకు ఈ-క్రాప్ చేయాలన్నారు. సాగులో ఏ పంట ఉందో... ఆ పంటకే నమోదు చేయడంవల్ల రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాలు, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాలకు ఈ-క్రాప్ ప్రామాణికమని.. ఈ-క్రాప్‌లో తప్పులకు చోటు ఇవ్వొద్దని సూచించారు. అనంతరం ఆయన శనగ, వేరుశనగ, పత్తి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ హారిక, రైతులు పాల్గొన్నారు.

దుప్పట్లు వితరణ



దివ్యాంగుడికి దుప్పటి పంపిణీ చేస్తున్న చర్చి ఫాస్టర్ ఆనందరావు, తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక ముద్దనూరు రోడ్డులోని దివ్యాంగుల భవనంలో దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వైఎస్ చిన్న కొండారెడ్డి స్మారకార్థం దివ్యాంగులకు వైఎస్సార్ సీపీ తొండూరు మండల ఇన్‌ఛార్జి వైఎస్ మధురెడ్డి సమకూర్చిన దుప్పట్లను సోమవారం సీఎస్ఐ చర్చి ఫాస్టర్ ఆనందరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల నెట్‌వర్క్ నాయకులు రఘునాథరెడ్డి, ఆర్. వెంకటసుబ్బయ్య, సునీల్, బషీర్, జగదీష్, లింగాల మండల వికలాంగుల సమాఖ్య నాయకులు నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేసిన ఫౌండేషన్ సభ్యులు

జమ్మలమడుగు: మండల పరిధిలోని పొన్నతోట సెయింట్ అంథోల్ చర్చి పరిధిలో ఉన్న పలు గ్రామాల వృద్ధులకు ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్‌నీడ్ సంస్థకు చెందిన డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డిలు దుస్తులను పంపిణీ చేశారు. సోమవారం చర్చి ఆవరణలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 120 మంది వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ రాజన్న పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని భారత్ మెడికల్ అండ్ క్లినిక్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వేల్పుల బాష ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు నూరిపర్వీన్ పాల్గొని ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో సీఐ మంజునాథ్‌రెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షులు గంగాధర్‌రెడ్డి, కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, అనాధ ఆశ్రమ నిర్వాహకులు నాగేంద్ర పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభ కార్యక్రమంలో వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పులివెందుల పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు ప్రారంభించారు. అలాగే పార్కుకు కూడా భూమిపూజ చేశారు. అంతకముందు ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి వారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం వారు వాటర్ ప్లాంటులోని యంత్ర పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఈశ్వరయ్య, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల ఎంవీఐగా వెంకట ప్రసాద్

పులివెందుల రూరల్ : పులివెందుల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా సోమవారం బి.వెంకట ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనుగొండలో అసిస్టెంట్ ఎంవీఐగా పనిచేస్తున్నానని.. పదోన్నతిపై పులివెందులకు వచ్చానన్నారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్‌లు కలిగి ఉండాలని.. రికార్డులు కూడా పక్కాగా ఉండాలన్నారు. ఎఫ్‌సీ లేకుండా వాహనం నడిపితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంవీఐ వై.ప్రసాద్ కడప ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ అయ్యారు.



పులివెందుల టౌన్/రూరల్ : సతీసమేతుడైన కల్యాణ శ్రీరంగనాథుడు



వేంపల్లె : గరుడ వాహనంపై దర్శనమిస్తున్న శ్రీవృషభాచలేశ్వరుడు



చక్రాయపేట: ప్రత్యేక అలంకరణలో గండి అంజన్న



ఎర్రగుంట్ల : ప్రత్యేక అలంకరణలో సతీసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి



ముద్దనూరు: చెన్నకేశవస్వామి ఆలయంలో అలంకరణలో విగ్రహమూర్తులు



వీఎన్ పల్లె : కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న వేద పండితులు



పులివెందుల టౌన్/రూరల్ : శ్రీ రంగనాథ స్వామి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ముక్కోటి

వేముల : వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామంలోని శ్రీమోపూరి భైరవేశ్వరస్వామి ఆలయం, వేములలోని శ్రీలక్ష్మీనరసింహాస్వామి, శ్రీమంజునాథస్వామి ఆలయాలలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డిలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

ప్రథమ విజేత మోట్నూంతలపల్లె ఎద్దులు

పులివెందుల రూరల్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని ఉలిమెల్ల గ్రామం నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలలో మొదటి విజేతగా పులివెందుల మండలం మోట్నూంతలపల్లె గ్రామానికి చెందిన కొప్పుల నారాయణకు చెందిన ఎద్దులు నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ భాస్కర్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేసి అభినందించారు.

రంగనాథుని కల్యాణం కమనీయం

పులివెందుల టౌన్/రూరల్ : పట్టణంలోని శ్రీవేంకటరమణుడి ఆలయం, శ్రీరంగనాథస్వామి ఆలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించి కాయ కర్పూరాలను సమర్పించారు.

– శ్రీరంగనాథస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణం ఆలయ అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఈశ్వరయ్యలను ఆలయ చైర్మెన్ సుధీకర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అర్బన్ సీఐ రాజు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

– ఉలిమెల్ల గ్రామంలో బండలాగుడు పోటీలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. అంతకముసుపు ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పద్మావతి, పార్నపల్లె కిశోర్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు శంకర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె : స్థానిక శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానం అనుసంధానమైన శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయాలలో అర్చకులు హరిప్రవీణ్, అచ్యుత్ నారాయణ, ప్రసాద్‌శర్మల నేతృత్వంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేత వృషభాచలేశ్వరుడు, వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు, సీతారాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు ఉత్తర ద్వారాల గుండా దర్శనం కల్పించారు. అనంతరం పట్టణ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ కె.వెంకటేష్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వి.రాజారావు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్: పట్టణంలోని టీటీడీ శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఉదయం 5 గంటలకు స్వామి వారి దర్శనం కావడంతో తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు పెద్ద ఎత్తున క్యూలో బారులు దీరారు. సుప్రభాత సేవ అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు.

వల్లూరు: పుష్పగిరిలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్తర ద్వార దర్శనానికి సోమవారం భక్తులు భారీగా తరలి వచ్చారు. చెన్న కేశవునితో బాటు, సంతాన మల్లేశ్వ స్వామి, లక్ష్మి దేవి మూలవిరాట్‌లకు వివిధ రకాల పూలతో పూలంగి సేవను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించడం విశిష్టతను సంతరించుకుని భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవిత్ర పెన్నా నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ వెంకటేశ్వర స్వామి అలంకారంలో గరుడ వాహనంపై కొలువు దీరి దర్శనమిచ్చిన శ్రీ చెన్నకేశవుని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుని తరించారు.

బ్రహ్మోత్సవాలలో అక్షతదియ పర్వదినాన మాత్రమే గరుడ వాహనంపై కొలువుదీరి దర్శనమిచ్చే చెన్నకేశవ స్వామి చిన్న బ్రహ్మోత్సవంగా పిలిచే వైకుంఠ ఏకాదశి పర్వదినాన గరుడవాహనంపై దర్శనమివ్వడం ప్రత్యేకత సంతరించుకుంది. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

కమలాపురం: పట్టణంలోని రైల్వే గేట్ సమీపంలోని రాధాకృష్ణ మందిరం, రామాపురంలోని మోక్షనారాయణ స్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకుల ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం వేకువజాము నుంచి రెండు ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. మోక్షనారాయణ స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతంతో పాటు శ్రీ మహాలక్ష్మి సమేత మోక్షనారాయణ స్వామి , శీ వల్లీ దేవసేన సమేత కల్యాణం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

చక్రాయపేట: గండి క్షేత్రంలో వేడుకలు నిర్వహించారు. ఆలయ సహా య కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల కోసం ప్రత్యేకంగా అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

చక్రాయపేట పోలీసు స్టేషన్ పక్కనే ఉన్న శ్రీవేంకటేశ్వర, రాచరాయ స్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో పురోహితుడు అనంత పద్మనాభ శర్మ మూలవిరాట్ లకు ప్రత్యేక అలంకరణ చేశారు. మాజీ చైర్మన్‌లు రామాంజనేయ రెడ్డి, చక్రపాణి రెడ్డి, హరనాథరెడ్డి, సభ్యులు రంగారెడ్డి, నరసింహులు, శ్రీరామమూర్తిలు ఏర్పాట్లను పరిశీలించారు.

కొండాపురం: బెడుదూరు గ్రామ సమీపంలోని కొండపైన వెలసిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా భక్తులు నిర్వహించారు. భక్తులకు చౌటిపల్లె ఓబుళరెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సింహాద్రిపురం : అంకాలమ్మ గూడూరు గ్రామంలోని అంకాలమ్మ ఆలయంలో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కసనూరులోని శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు విజయ్‌కుమార్.. చెన్నకేశవస్వామిని ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో భాగవత పఠనం నిర్వహించారు.

ముద్దనూరు: మండలంలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు ఉత్తర ద్వారం నుంచి మూలవిరాట్‌లను దర్శించుకున్నారు. ముద్దనూరులోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామి ఆలయం, పెద్ద దుద్యాలలోని వరదరాజస్వామి, వనంలోని రంగనాథస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల, చిలంకూరులో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వారం నుంచి భక్తులు శ్రీ స్వామిని దర్శించుకున్నారు. ఎర్రగుంట్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కాలనీలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఆలయ నిర్వాహకులు కోలాటం ఏర్పాటు చేశారు.

పెద్దముడియం: వైకుంఠ ఏకాదశి సందర్భంగా గ్రామాలలోని దేవాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. అర్చకులు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు ఉదయం నుండే దేవాలయాలకు చేరుకొని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు.

వీరపునాయునిపల్లె: మండల పరిధిలోని ఉరుటూరు గ్రామంలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ వాసుని కల్యాణం సోమవారం వైభవంగా సాగింది. శివాలయం నుంచి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు 108 కలశాలతో నిర్వహించిన గ్రామోత్సవం కన్నుల పండుగగా సాగింది. స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఉమామహేశ్వర శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహోత్సవంలో ఉభయదాతలుగా కొత్తపు ఈశ్వర్‌రెడ్డి దంపతులు కూర్చున్నారు. ఈశ్వర్‌రెడ్డి కుమారుడు కె.యల్.జి. దేశిక్ భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన ఊంజల్ సేవ కనువిందు చేసింది.



వల్లూరు: పుష్పగిరిలో గరుడ వాహనంలో దర్శనమిస్తున్న చెన్నకేశవస్వామి



జమ్మలమడుగు రూరల్: ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు



జమ్మలమడుగు రూరల్: దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



సింహాద్రిపురం : ప్రత్యేక అలంకరణలో అంకాలమ్మ అమ్మవారు



పులివెందుల టౌన్/రూరల్ : వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద తెల్లవారు జామున బారులు తీరిన భక్తులు



వీఎన్ పల్లె : స్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

మెనూ ప్రకారం భోజనం వడ్డించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్పీటీసీ, సర్పంచ్

కమలాపురం: ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని కమలాపురం జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, నల్లింగాయపల్లె సర్పంచ్ హైమావతి తెలిపారు. సోమవారం వారు నల్లింగాయపల్లె హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఇలాగే మెనూ ప్రకారమే భోజనం వడ్డించాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్‌లను కోరారు. అనంతరం జంభాపురం సచివాలయాన్ని పరిశీలించారు. అర్హుల జాబితా, అనర్హుల జాబితాను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

వేంపల్లె : మామిడి తోటల్లో తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని వేంపల్లె ఉద్యాన శాఖాధికారి రెడ్డయ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అలిరెడ్డిపల్లె గ్రామ పొలాల్లో మామిడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన సమయంలో తెగుళ్ల సోకకుండా క్రిమిసంహారక మందులను పిచికారి చేసినట్లయితే మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. ముఖ్యంగా పూత సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో ఆనందం

– ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

జమ్మలమడుగు రూరల్: ప్రతి కుటుంబంలో సంక్షేమ పథకాలతో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం జమ్మలమడుగు మండల పరిధిలోని గూడెం చెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి పాల్గొన్ని ప్రజల సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కాలనీలో రోడ్డు, డ్రైనేజీలు ఏర్పాటుచేయాలని అప్పుడప్పుడు తాగునీటి సమస్య ఏర్పడుతున్నదని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజీవ్‌నగర్ కాలనీలో రానున్న రోజుల్లో మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. తాగునీటి సమస్య ఉన్నకాలనీలో వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఇంటి స్థలాలు లేని ప్రతి నిరుపేదకు ఇండ్లస్థలాలు మంజూరుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకు దక్కుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి రావడానికి కుయుక్తులు పన్నుతున్నారన్నారు. ప్రజలు ఆయన మాటలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గుంటూరులో చంద్రన్న కానుకలు ఇస్తామని చెప్పి చిన్న సందుల్లో బహిరంగ సమావేశాలు పెట్టి ప్రజల మరణానికి కారణమయ్యారని ఆయన విమర్శించారు. ఎంపీటీసీ లక్ష్మీదేవి, సర్పంచ్ మజ్జారి నాగేశ్వరి, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, అధికారులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు రమణయ్య యాదవ్, నాగేశ్వరరెడ్డి, సంజీవరాయుడు, కట్ట శ్రీను పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జగనన్న ఇళ్లు పూర్తి చేయాలి

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల పట్టణం, మండల పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్లు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి వీరబ్రహ్మం తెలిపారు. సోమవారం ఎర్రగుంట్ల పట్టణంలోని ఎంపీడీఓ సభాభవనంలో జగనన్న ఇళ్లు పనుల గురించి అధికారులతో కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఎర్రగుంట్ల కమిషనర్ పి జగన్నాథ్ , తహసీల్దార్ ఎ నాగేశ్వరరావు, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, రూరల్ ఏఈ నాగజ్యోతి, వెలుగు ఏపీఎం జగదీశ్వరీ, మెప్మా సిఓలు విమల, వసంతరెడ్డిలతో పాటు ఇతర శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల స్పెషలాఫీసర్ రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. డీటీ వెంకటరెడ్డి, పీఆర్ ఏఈ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పెంఛన్‌దారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పెద్దకొండప్ప కాలనీ సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి నూతన పింఛన్ దారులకు పంపిణీ చేశారు. సోమవారం సచివాలయంలో కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. అలాగే వెంకటాపురం వార్డు పరిధిలోని నూతన పింఛన్ దారులకు ఆ వార్డు కౌన్సిలర్ విజయ్‌కుమార్ నాయుడు, కౌన్సిలర్ డేనియల్ బాబు, కో.ఆప్షన్ మెంబర్ చంద్రమౌళిలు పింఛన్ డబ్బులను పంపిణీ చేశారు. అంతకమునుపు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి నూతన పింఛన్‌దారులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్పీకర్ సెట్ వితరణ



పాఠశాలకు స్పీకర్ సెట్, కుర్చీలను అందిస్తున్న మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు

వల్లూరు: గంగాయపల్లెలో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రస్తుతం హైదరాబాదులో నివాసం వుంటున్న పాఠశాల పూర్వ విద్యార్థిని వంకదారి పంకజ కుమారి సుమారు 25 వేల రూపాయలకు పైగా విలువ చేసే ఆహుజా ట్రాలీ స్పీకర్ సెట్‌తో బాటుగా 10 ప్లాస్టిక్ కుర్చీలను వితరణగా ఇచ్చారు. వల్లూరుకు చెందిన వంకదారి మల్లయ్య కుమార్తె అయిన ఈమె 1974వ సంవత్సరంలో ఈ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్నారు. తాను చదువుకున్న పాఠశాలకు సహాయం అందించాలని భావించిన ఆమె స్పీకర్ సెట్‌ను, కుర్చీలను వితరణగా ఇచ్చారు. ఈ మేరకు స్థానిక పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాజీ ఉప సర్పంచ్ వంకదారి ఆంజనేయులు చేతుల మీదుగా వీటిని ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ నాయక్‌కు అందచేశారు.

న్యాయం చేయండి సారూ..

జమ్మలమడుగు: తనకు న్యాయం చేయాలంటూ కన్నెలూరు అంగన్వాడీ 3 సెంటర్‌లో హెల్పర్‌గా పనిచేసిన బసీరున్ సోమవారం ఆర్డీఓ జి.శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించింది. సోమవారం స్పందనలో భాగంగా ఆమె ఆర్డీఓను కలిసి వినతి పత్రం సమర్పించారు. తనకు 53 సంవత్సరాలు మాత్రమే ఉన్నాయని అయితే ఆధార్‌కార్డులో 60 సంవత్సరాలు ఉన్నాయంటూ అధికారులు తొలగించారని వాపోయారు. రేషన్ కార్డులోగాని, ఓటరు ఐడీలో తనకు 53 సంవత్సరాలు మాత్రమే ఉన్నాయి. అంతేకాకుండా వైద్యులు కూడా తనకు 60 సంవత్సరాలు వయసు లేదంటూ ధృవీకరణ పత్రం ఇవ్వడం జరిగింది. ఉన్నతాధికారులు తనకు ఉన్న అంగన్వాడీ హెల్పర్ పోస్టును తనకు ఇప్పించాలంటూ వినతి పత్రం సమర్పించింది.